అక్టోబర్ 28 కొ. కు. పుట్టినరోజు :

# సామాజిక వ్యాఖ్యాత కొడవటిగంటి కుటుంబరావు

కె. బాలగోపాల్

హైదరాబాద్‌లో నాంపల్లి స్టేషన్ రోడ్డులో 'హరేకృష్ణ' భజనసంఘం కార్యాలయం వుంది. ఆ రోడ్డుమీద పోతూవుంటే ఆ సంఘంసభ్యులు తరచుగా భజనచేస్తూ తారసపడతారు. అందరూ చూడడానికి ఒకేలాగుంటారు. అందరి వేషధారణా ఒకేలాగుంటుంది. అందరిపలుకూ ఒకేలాగుంటుంది. అందరి ఆలోచనలూగూడ బహుశా ఒకేలాగుంటాయేమో. ఉంటే అది మనుష్యులకు అస్వాభావికమేగాని భజనభక్తులలో అసాధారణంకాదు. ఒక 'గురువు' పాదాలచెంత తమవ్యక్తిత్వాల్ని అర్పణచేసి తాము ఊహించుకున్న 'భగవంతుడి'తో తాదాత్మ్యం చెందడం అనిపిలువబడే అఖండ ఉన్మత్తస్థితిని పొందడం భజనసంఘాల లక్ష్యం. ఆ అఖండస్థితిలో వ్యక్తిత్వాలకు రంగూరుచీవాసనా ఉండవు. ఉండకపోవడమే వాళ్ళకుకావాలి. అటువంటి స్థితిలో ఆలోచనఅంటూవుంటే అది అందరిలోనూ ఒకేలాఉండడంలో ఆశ్చర్యం లేదు.

కమ్యూనిజంగూడ మనుషుల్ని రంగూ రుచీవాసనాలేని మూసమనుషులుగా మారుస్తుందనే బూర్జువాదూషణ ప్రచారంలోవుంది. అది అబద్ధంకావడానికి ఒకటే కారణం. ప్రజాఉద్యమాల లక్ష్యం నిర్గుణమయిన తాదాత్మ్యస్థితిని సాధించడంకాదు, ఈ భౌతికప్రపంచాన్ని ఇప్పుడున్నదానికంటే అందంగా తీర్చిదిద్దడం. అట్లా తీర్చిదిద్దడంలో ప్రపంచానికి సహజమయిన వైవిధ్యంనశించదు. అందులోని చెడు రాలిపోతుందిగాని మంచి మరింత రాణిస్తుంది. ప్రజలజీవితంలో ఎంతవైవిధ్యంవుందో ప్రజారాజ్యంలో అంతఉంటుంది, ప్రజాఉద్యమంలోనూ అంతఉంటుంది. ప్రజాఉద్యమంలోకి వచ్చేవాళ్ళ వ్యక్తిత్వాలు ఉద్యమంలో కరిగిపోవు. ఉద్యమం వాళ్ళవ్యక్తిత్వంలో కరిగిపోతుంది. తమపూర్వవ్యక్తిత్వాలను ఉద్యమ వ్యక్తిత్వాలుగా ఒక్కొక్కరూ ఒక్కొక్కవిధంగా మలచుకుంటారు. విప్లవోద్యమంలో భాగంగా ఒక రచయితనయినా ఇతర రంగాలలో పనిచేసే కార్యకర్తనయినా అర్థంచేసుకునేటప్పుడు ఈ అవగాహనతో ప్రారంభించడం ప్రథమం.

మార్క్సిస్టు రచయితగా కొడవటిగంటి కుటుంబరావుకు ఒక స్వతంత్రమయిన తాత్విక వ్యక్తిత్వంవుంది. ఇక్కడ 'స్వతంత్రం' అంటే సిద్ధాంతానికీ ఉద్యమానికీ

అతీతమయినదని కాదు, తన స్వంతమైనదిగల సమగ్రమయిన తాత్త్వికవ్యక్తిత్వం వుందని. ఇది కుటుంబరావు ప్రత్యేకత, ఎందుచేతనంటే మార్క్సిస్టు రచయితలకు సాధారణంగా తమదయిన సాహిత్యవ్యక్తిత్వం ఉంటుందిగాని తాత్త్వికవ్యక్తిత్వం ఉండదు. తాత్త్విక విషయాలలో అభిప్రాయాలు మాత్రమే ఉంటాయి. ఆ అభిప్రాయాలు మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలనుండి గ్రహించినవి కావచ్చు, వాటి విపులీకరణలు గూడకావచ్చు. కాని పలికే ప్రతీవాక్యంలోనూ ప్రతిఫలించేటటువంటి విస్తృతి మాత్రమే కాక పుష్టిగూడ కలిగిన తాత్త్విక దృక్పథం ఉండడం అరుదు. అందుకే సాధారణంగా మార్క్సిస్టు రచయితలు గతితార్కిక భౌతికవాదం గురించో ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితి గురించో రాయమంటే దీర్ఘమయిన వ్యాసాలు రాయగలరుగాని చెట్టుమీదా పుట్టమీదా రాయమంటే రాయలేరు. అథవా రాసినా, ఆ పూటకు మార్క్సిజం పక్కకుపెట్టి తమ పూర్వాశ్రమ 'సంస్కార'మయిన మధ్యతరగతి మర్యాదస్తుల దృక్పథంతో రాస్తారు. ఒక్కొకసారి చాలా రియాక్షనరీగా రాస్తారుగూడ. కాని కుటుంబరావు మాత్రం కుటుంబరావుగానే లెనినిజం నుండి సినిమా పాటల వరకు అన్నిటిగురించీ రాసాడు. దేనిగురించిరాసినా మనకు కుటుంబరావు గొంతే వినిపిస్తుందిగాని మార్క్సిజం గొంతు ప్రత్యక్షంగా వినిపించదు. అంతా చదివిన తరువాత, ఆ ఆసక్తిగాని మనకు ఉంటే, ఇది మార్క్సిజమేనా అన్న మీమాంస మనకే మిగులుతుంది. ఒక్కొకసారి ఆ ప్రశ్నార్థకం ప్రశ్నార్థకంగానే మిగులుతుంది గూడ.

కుటుంబరావు 20వ శతాబ్దపు ప్రథమభాగంలో కోస్తా ఆంధ్రప్రాంతంలోని పట్టణాలని పిలవబడే బలిసిన పల్లెటూళ్ళలో ఒకదానిలో పుట్టాడని, మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో పెరిగాడని, తెలియకపోతే మనకు కుటుంబరావు అర్థంకాడు. ఆయన ఆలోచనలను మార్క్సిజం శోధనచేసిన తరువాత గూడ ప్రతిక్షేపంగా మిగిలిపోయి ఆయన తాత్త్వికవ్యక్తిత్వంలో రంగరించుకుపోయిన ఈ పూర్వాశ్రమపు అంశాలు కొన్ని ఉన్నాయి. బహుశా అవేలేకుంటే అభ్యుదయ భావాల్ని బూర్జువా వారమాసపత్రికల పాఠకుల దగ్గరికి తీసుకుపోవడంలో ఆయన సాధించిన విజయం సాధ్యమయ్యేది కాదేమో. 'యువ'లోను 'ఆంధ్రజ్యోతి'లోను 1970 తరువాత ఆయన రాసిన వ్యాసాలుచూస్తే ఈ విషయం అర్థంఅవుతుంది. మార్క్సిజం అంటే బహుశా ఇష్టంలేని వాళ్ళదగ్గరికి, 'బూర్జువా' 'దోపిడీ' వగైరా పదజాలాన్ని విని దడుసుకునే వాళ్ళదగ్గరికీ, శాస్త్రీయసోషలిస్టు భావాలను చేర్చడానికి ఆయన చేసిన

ప్రయత్నం ఈ వ్యాసాలన్న సంగతి మనం మరచిపోకూడదు. మరచిపోయి ఈ వ్యాసాలను విశ్లేషిస్తే ఆయనకు అన్యాయం చేసిన వాళ్లమవుతాము. ఆప్రయత్నంలో ఆయన అనుసరించిన శైలి పరిశీలించదగ్గది. అనుసరించదగ్గదో కాదో నాకు తెలీదు. మార్క్సిస్టు పారిభాషికపదాలనూ సిద్ధాంతాలనూ కొటేషన్లనూ వీలయినంతతక్కువగా ప్రయోగించి మార్క్సిజాన్ని వివరించే ప్రయత్నం కొన్ని సందర్భాలలో తప్పకుండ కాంక్షనీయం. రష్యాలో జార్ ప్రభుత్వం సెన్సార్ కళ్లు కప్పడానికి ప్లెఖనోవ్ 'materialist' అనేబదులు 'monist' అనే పేరుపెట్టి మార్క్సిస్టు చారిత్రిక భౌతిక వాదంమీద పుస్తకం రాసాడు. లెనిన్ గూడ సామ్రాజ్యవాదంమీద తన ప్రామాణికమయిన వ్యాసం రాసేటప్పుడు రష్యన్ ప్రభుత్వ సామ్రాజ్యవాద చర్యల గురించి మాత్రం చెప్పకుండ జాగ్రత్త పడవలసి వచ్చింది. అయితే ఈ ప్రభుత్వ సెన్సార్ లేకున్నా మధ్యతరగతి పాఠకుల మనస్సులలో ఒక సెన్సార్ వుంటాడు. వాడి కళ్ళు కప్పే ప్రయత్నం చేయకుండ నాసోది నేను చెప్పుకుపోతానంటే దానివల్ల ప్రయోజనం వుండదు. అసలు చెప్పటమయినా మానేసి రాజకీయ ఉద్యమమే మధ్యతరగతిని అభ్యుదయ పంథాలోకి తెస్తుందని ఊరుకోవాలి, లేకుంటే మధ్యతరగతి భాషలో మధ్యతరగతికి చెప్పాలి. ఇందులో మొదటిది ఆచరణశూన్యమయిన బహిష్కరణ (passive boycott). అందులో గొప్పతనంలేదు. రెండవది ఆచరణాత్మకమేగాని అందులో ఒక ఇబ్బంది వుంది. తగినటువంటి పారిభాషిక పదాలులేకుండ, సిద్ధాంత చట్రంలేకుండ, శాస్త్రీయంగా ఆలోచించడం సాధ్యమనే అపోహను అది కలిగిస్తుంది ఎలెక్ట్రాన్ ప్రోటాన్ అనేపదాలు వాడకుండ భౌతికశాస్త్రాన్ని వివరించలేరా అని ఎవ్వరూ అడగరు, కాని దోపిడీ, బూర్జువా అనే మాటలు వాడకుండ ఈప్రపంచాన్ని వివరించలేరా అనిమాత్రం ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్న న్యాయమయినదనే భ్రమ కలిగించకూడదు.

అంతేకాదు, సిద్ధాంతంవరకు పోకున్నా, ప్రపంచాన్ని అర్థంచేసుకునే పద్ధతిలోనే మార్క్సిజానికీ బూర్జువాదృక్పథానికీ మౌలికమయిన తేడావుంది. మార్క్సిజం సమాజానికి (ఎవరి ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండ)వున్న భౌతికస్వరూపంతో ప్రారంభించి వ్యక్తిని ఆ సమాజనిర్మాణంలో ఒక నిర్దిష్టమయిన స్థానంగల మనిషిగా అర్థంచేసుకుంటుంది. బూర్జువాదృక్పథం వ్యక్తితోప్రారంభించి అతనికొక 'సహజ' మయిన మనస్తత్వం ఆపాదించి, అటువంటి వ్యక్తులు పరమాణువులుగా ఏర్పడ్డ సమూహంగా సమాజాన్ని అర్థంచేసుకుంటుంది. ఒకటి సమాజంనుండి వ్యక్తిని,

రెండవది వ్యక్తినుండి సమాజాన్ని, నిరూపిస్తాయి. కాబట్టి మార్క్సిస్టు సిద్ధాంత చట్రాన్ని ప్రయోగించకుండ అభ్యుదయభావాలను తెలపాలని ప్రయత్నిస్తే అది అనివార్యంగా వ్యక్తినుండి సమాజాన్ని నిరూపించే బూర్జువావాచట్రంలో కూరుకుపోయి 'వ్యక్తికి ఆర్థికం ప్రధానం' (man is an economic animal) అనే క్షుద్ర భౌతికవాదానికి దిగజారే ప్రమాదంవుంది. ఉదాహరణకు, కళకుగల భౌతికపునాదిని తీసుకుందాం. ఉత్పత్తి రంగంచేత నిర్ణయించబడే ఉపరితలంలో కళ ఒకభాగం. సామాజిక ఉత్పత్తిచేత నిర్ణయించబడే సామాజిక చైతన్యంయొక్క వివిధ రూపాలలో కళఒకటి. పునాదిలోని వైరుధ్యాలతో సహా పునాదిముద్ర కళమీదవుంటుంది. అంటే కళకు చారిత్రిక స్వభావం, వర్గస్వభావం, ఉంటాయి. ఇది (స్థూలంగా) మార్క్సిస్టు అవగాహన. దీన్ని 'ఎవ్వరికీ అర్థంకాని' ఈ భాషలో చెప్పకుండ 'అందరికీ అర్థమయ్యేటట్టు' బూర్జువా వ్యక్తివాదం చట్రంలో ఇమిడ్చి చెప్పేటప్పుడు ఔత్సాహిక మార్క్సిస్టులు చాలామంది ఈ విధంగా వాదిస్తారు. 'ముందు కడుపుకు తిండి వుంటేగదా కళఅయినా సాహిత్యమయినా' అని. ఇది నిజమే, కాని కళకు సంబంధించి మార్క్సిస్టు అవగాహన మాత్రం కాదు.

ఔత్సాహికులు కానివారుగూడ, వ్యక్తిపరంగా మార్క్సిజాన్ని వివరించే ప్రయత్నంగాని వ్యక్తినుండి సమాజాన్ని నిరూపించే ప్రయత్నంగాని చేయకున్నా, ఉపరితలంతో ప్రారంభించి పునాదిని వెతుక్కోవడమో చైతన్యంతో ప్రారంభించి పదార్థాన్ని వెతుక్కోవడమో చేస్తారు. ఇది కుటుంబరావు రచనలలో విరివిగా కనబడుతుంది. ఉదాహరణకు ఈ సంకలనంలోవున్న 'కళలు' అనే వివాదాస్పదమయిన వ్యాసాన్ని తీసుకుందాం. కళల యొక్క సామాజికపాత్రను వివరించే వ్యాసం ఇది. వివరణ పునాదితో ప్రారంభం కాకుండ ఉపరితలంతోనూ వ్యక్తితోను ప్రారంభమవుతుంది. కళాకారుడు వ్యక్తి. అతను సమాజంలో పుట్టినవాడుగనకా, అతని కళ సమాజంలో చెల్లుబాటుకావాలి గనకా, అతని కళకూ సమాజానికీ సంబంధం వుండి తీరుతుంది ఒక 'నికరమయిన జాతీయ సంస్కృతి' వున్నచోట ఏ వర్గానికీ చెందని జాతీయకళ సాధ్యమేమోగాని, భిన్నవర్గాల 'సంస్కారాలు' భిన్నంగా వున్నచోట ఏ కళాకారుడి కళకు అయినా ఒక వర్గంనుండి ప్రోత్సాహం రావాలి. అంటే అతని కళ మనగలగాలంటే అది వర్గకళకావాలి. ఈ విధంగా కళకుగల వర్గస్వభావాన్ని వ్యక్తిగా కళాకారుడితో ప్రారంభించి ఆవిష్కరిస్తాడు కుటుంబరావు. వర్గవైరుధ్యాల నుండి వర్గకళ పుడుతుందన్నట్టుకాక, కళఅనేది నైరూప్యంగా (abstract) ప్రారంభమయి

వర్గవిభేదాలతో కలుషితమయిన ఈ ప్రపంచంలో అనివార్యంగా వర్గస్వభావాన్ని సంతరించుకుంటుందన్నట్టు ఉంటుంది. దీనిఫలితమే వ్యాసంలోని తక్కిన వివాదాస్పదమయిన విషయాలన్నీ: కళలు నిజజీవితంలోని అడ్డుగోడల్ని ('స్వార్థం, సంఘమర్యాద, వర్గతత్వం') తుడిచేసి, జీవితం నుండి లభించే వ్యక్తిగతమయిన స్పందనను సార్వజనీనం చేస్తాయనీ, ఒకవర్గం కష్టాలపట్ల తక్కిన వర్గాలకు సానుభూతి జీవితం కలిగించలేదుగాని కళలు కలిగించగలవనీ, వగైరా. ఉపరితలంతో ప్రారంభించి పునాదిని వెతుక్కునే తార్కికశైలి ఫలితంతానే (అది తార్కికశైలి మాత్రమే, అవగాహనా లోపంకాదు) కుటుంబరావు కళాసాహిత్యరంగాలను సమాజంకన్న ఉన్నతంగా భావించాడన్న అనుమానానికి తావుకలుగుతుంది.

ఈ శైలికి ఎంతవరకు ఆయన తాత్వికవ్యక్తిత్వంలోని 'వెజిటేరియన్' స్వభావం కారణమో, ఎంతవరకు బూర్జువా పత్రికలలో రాయడంవల్ల ఏర్పడ్డ పరిమితి కారణమో విడదీసి చెప్పడంకష్టం. ఈ లక్షణం లేకుంటే మాత్రం అభ్యుదయాన్ని మార్క్సిస్టు సిద్ధాంత పారిభాషిక చట్రానికి అతీతంగా వివరించడం సాధ్యం కాదనిపిస్తుంది. ఇది ఉలిపికట్టె తత్వంతో అంటున్నమాట కాదు, ఆలోచనమీద అంటున్నదే. ఉదాహరణకు 'అనవసరమయిన నమ్మకాలు' అన్న వ్యాసంవుంది. 'దేవుళ్లనూ మతాన్నీ తుడిచిపెట్టే వ్యర్థప్రయత్నం' ఎందుకుతప్పన్న విషయాన్ని పునాదిని గట్టిగా తడమకుండ బూర్జువా హేతువాదులకు 'వాళ్లభాషలోనే' చెప్పేప్రయత్నం ఈవ్యాసంలో కుటుంబరావు చేసినట్టు కనబడుతుంది. లేకపోతే, మూఢనమ్మకాలను కొన్ని సాముదాయిక రుగ్మతలనీ, కొన్ని ఆపద్ధర్మాలనీ, కొన్ని ప్రమాదకరంకాని విశ్వాసాలనీ, కొన్ని మాత్రమే దోపిడీదారులచేత పోషించబడే ప్రమాదకరమయిన మతమౌఢ్యానికి చెందినవనీ ఎందుకు వర్గీకరించేవాడు? ప్రమాదకరమయిన మూఢనమ్మకాలను మాత్రమే ఎదిరిస్తేచాలు, మిగిలినవి ఉన్నాఫరవాలేదనేవాదం, కలవాళ్ల దగ్గర కట్నం తీసుకున్నా ఫరవాలేదని కొందరు తెలివిమీరిన యువకులు చేసేవాదం లాంటిది. దానికి హేతువాదులు సులభంగా సమాధానం చెప్పగలరు. కనబడ్డలింగానికల్లా లెంపలేసుకోవడం ప్రమాదకరంకాని వెర్రిచేష్టలాగ కనిపించవచ్చు, కాని ఆపనిచేసేవాడి మెదడులోకి రేపు ప్రమాదకరం అయినవికూడ సులభంగా ప్రవేశిస్తాయి. నిజానికి, మూఢనమ్మకాలపట్ల మార్క్సిస్టు దృక్పథాన్ని బూర్జువాతాత్విక పరిభాషకు లోబడి వివరించక పునాదితో ప్రారంభించి విచారిస్తే విషయాన్ని సమగ్రంగా వివరించవచ్చును. ప్రమాదకరమయినవి - కానివి అనేదికాక, వర్గపోరాటానికి ప్రతిబంధకమా కాదా అనేది

సరయిన విభజనగా నిరూపించవచ్చును. ఈ పని కుటుంబరావు చేయగలడుగూడ. డేవిడ్ గెస్ట్ పుస్తకాన్ని సమీక్షిస్తూ 'మార్క్సిస్టు తత్వశాస్త్రం' మీద రాసిన వ్యాసాన్ని చూసినా, లేకపోతే విప్లవ రచయితలకు మార్క్సిస్టు దృక్పథం ఎందుకుండాలో మోటూరి హనుమంతరావుకిచ్చిన సమాధానం (రచయితలు - మార్క్సిజం - రాజకీయాలు') చూసినా, కుటుంబరావు సామర్థ్యాన్ని గురించి అనుమానం రాదు.

అనుసరణీయమో కాదో, తానుఎంచుకున్న కార్యక్రమాన్నిమాత్రం కుటుంబరావు ప్రశంసనీయంగా నిర్వహించాడని చెప్పాలి. వ్యాపార పత్రికలలో మామూలుగా, కాల్పనికసాహిత్యంమాట ఎలాగున్నా, వ్యాసాలస్థాయి చాలాతక్కువగా వుంటుంది. అయితే వెకిలితనమో కాకపోతే శుష్కపాండిత్యాన్ని ఏకరువుపెట్టడమో వాటిలక్షణం. అటువంటిచోట పాఠకులను సీరియస్‌గా ఆలోచింపజేసే వ్యాసాలను ప్రవేశపెట్టి శాస్త్రీయమయిన ఆలోచనాపరిణతినీ, అభ్యుదయభావాలనూ వ్యాపింపజేయడానికి చాలాదోహదంచేసాడు. ఈ వ్యాసాలకు సాధారణంగా ఒకనిర్దిష్టమయిన విషయం ఉన్నట్లు అనిపించదు. నిర్దిష్టమయిన విషయంవున్నా, వాదానికి స్పష్టమయిన తార్కిక నిర్మాణంవుండదు. సృజనలోనూ అరుణతారలోనూ ఆయనరాసిన వ్యాసాలుగూడ (పుస్తకసమీక్షల్ని మినహాయించి) ఇందుకు భిన్నంకాదు. ఒక విషయం తననుకదిపితే స్పందించి ఆ కదలిక ఎటు తీసుకుపోతే అటుపోయి ఎక్కడో ముగించినట్టుంటుంది. దీనికి దాదాపుగా ఏ వ్యాసాన్నయినా ఉదాహరణగా తీసుకోవచ్చు. 'శాస్త్రజ్ఞానం' అన్న వ్యాసాన్ని తీసుకుందాం. ప్రకృతిలో ప్రతిజంతువుకూ పరిణామక్రమంలో ఒక ప్రత్యేకత ఏర్పడింది. పక్షులకు రెక్కలు, పులికిపంజా, పాముకుకోరలు, వగైరా. మనిషిలో అటువంటి ప్రత్యేకత మెదడు. కాబట్టి ఈ మెదడును పదునుపెట్టుకుంటూ శాస్త్రజ్ఞానాన్ని అభివృద్ధిచేయడంద్వారా ముందుకుపోవడం మానవజాతియొక్క సహజపరిణామం. కాని సామాజికపరిణామం దీనికి విరుద్ధంగావుంది. ఎందుకంటే సమాజం రెండుగాచీలి వర్గసమాజం రూపంతీసుకోవడంతో దోపిడీవర్గాలు తమ అవసరాలకు అనుకూలమయిన మతమౌఢ్యాన్ని శాస్త్రజ్ఞానానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టడం జరిగింది. వర్గసమాజ నిర్మాణానికీ మానవుల ప్రకృతిసిద్ధమయిన భౌతికనిర్మాణానికీ మధ్యవున్న వైరుధ్యమిది, ఇది చాలా ఆసక్తికరమయిన విశ్లేషణ, కాని 'శాస్త్రజ్ఞానం' అన్నవ్యాసంలో కుటుంబరావు చెప్తున్నది ఈవిషయమేనని అర్థంచేసుకోవడానికి ఆ వ్యాసాన్ని కనీసం రెండుమూడుసార్లు చదవవలసి వుంటుంది. వాదనాక్రమం సూటిగా

సాగక, మధ్యలో జ్ఞాపకశక్తి ప్రాముఖ్యతగురించి, జ్ఞానాన్నిపంచుకునే పద్ధతిగురించి, 'పరమజ్ఞానం' అనేది లేకపోవడాన్ని గురించి, ఈ వాదనకు అప్రస్తుతమయిన అభిప్రాయాలు పుష్కలంగావుంటాయి.

అయినాసరే కుటుంబరావు చాలా సులభశైలితో రాసాడనే అభిప్రాయం వుండడానికి మూడుకారణాలు కనిపిస్తాయి. ఒకటి, ఆయన చిన్నచిన్న విషయాలమీద గూడ వ్యాసాలురాయడం. రెండు, ఒకవ్యాసాన్ని మొత్తంగాతీసుకుంటే ఎంత అస్తవ్యస్తంగా అనిపించినా అందులో పదివిషయాలను స్పృశించి వాటిమీద తన అభిప్రాయాలను సూటిగాచెప్పడం. మూడవకారణాన్ని కొంతవివరించాలి. వ్యాపార పత్రికల పాఠకులు ఎక్కువగా బూర్జువా సాహిత్యాభిమానులు, కళాభిమానులు. ఆ జాబితామనుషులకు సహజంగావుండే అతిశయంవల్ల వాళ్లు సాహిత్యాన్నీ కళనూ సమాజానికి అతీతమయిన విషయాలగా భావిస్తారు. సాహిత్యమూ సాహిత్యంతోబాటు తామూ సామాజిక వైరుధ్యాలను అంటకుండ దూరంనుండి పర్యవేక్షించి ఈ క్షుద్రమానవుల క్షుద్రమయిన బాధలను జాలిగుండెతో సమీక్షించగల ఉదారమానసులగా బూర్జువా సాహిత్యకారులు తమను తాము భావించుకుంటారు. ఆర్థిక పునాదినుండి సాంస్కృతికరంగాన్ని నిరూపిస్తే వాళ్ళ 'అహం' దెబ్బతింటుంది. అటువంటి నిరూపణ సాధ్యమని కుటుంబరావు నమ్మినవాడే, కాని ఆయన రచనలో ఇటునుండి అటుగాక అటునుండి ఇటువెళ్లడం జరుగుతుంది. పునాదిని వివరించి ఉపరితలాన్ని నిరూపించక, ఉపరితలాన్ని వివరించి పునాదితో 'లింక్' చేయడం కుటుంబరావు పద్ధతి. ఉదాహరణకు 'పుచ్చిపోయిన జీవితం' అనేవ్యాసంలో కళాభిరుచిని గురించి చర్చవుంది. కళాభిరుచిలో సామ్యం (ఏకీభావం) ఉండడంఅనేది మనుష్యులను ఏకం చేసే శక్తులలో ఒకటిఅనీ, అది సమాజంలో నిస్సందేహంగా ప్రగతిశక్తి అనీచెప్పి, ఈ విధంగా అంటాడు: "కళాభిరుచివల్ల ఒక కవినిగాని, రచయితనుగాని, గాయకుడినిగాని, నటుడినిగాని అభిమానించేవాళ్లంతా ఏకమవుతారు. ఈ అభిరుచి సంఘంలోవుండే మామూలు అడ్డుగోడలన్నిటినీ దూసుకుపోగలదు. అలాంటి పరిస్థితిలో ఆయాకళాకారులు తమ కళలద్వారా ప్రత్యేక సామాజిక ప్రయోజనాన్ని సాధించడానికి పూనుకున్నవారైతే కళాభిరుచులుగలవారు కనీసం మానసికంగా ఆ ప్రయోజనాలకు సుముఖులవుతారు." మామూలుగా మార్క్సిస్టు రచయితలు ఈ విషయాన్నే ఇలాచెప్తారు : కళకు అభ్యుదయకరమయిన సామాజిక ప్రయోజనం ఉండాలి. ఆ ప్రయోజనాన్ని కళ సమర్థవంతంగా సాధించాలంటే తదనుగుణ్యమయిన

కళాభిరుచిగూడ ప్రజలలో అభివృద్ధిచెందాలి. అభ్యుదయ ప్రయోజనంగల కళపట్ల అభిరుచి కలిగివుండడంలో ఏకమయినవారంతా బలమయిన ప్రగతిశక్తిగా రూపొందుతారు. కుటుంబరావు వాదనాక్రమం దీనికి సరిగ్గా తలక్రిందులుగా కనిపిస్తుంది.

ఈ వాదనాపద్ధతే కుటుంబరావులో ఏకసమయంలో ధనాంశా ఋణాంశా రెండూగూడ. అది ఋణాంశ ఎందుకయిందో పెద్దగా వివరించనక్కర లేదనుకుంటాను. ధనాంశ ఎందుకయిందంటే. కేవలం ఆ పద్ధతే బూర్జువాపాఠకులకు మింగుడుపడుతుందనికాదు. అంతమాత్రమే అయితే లెక్కించనవసరంలేదు. అంతకంటే ముఖ్యమయిన కారణం మరొకటివుంది. అదే బహుశా కుటుంబరావు రచనలపై ఆయన స్వంత 'ముద్ర' అనుకుంటాను. ఉపరితలానికి పునాదినుండి సాపేక్షమయిన స్వాతంత్ర్యంఉందని మార్క్సిజం అంటుంది. కాని ఒక ఉపరితలఅంశాన్ని పరిశీలించేటప్పుడు ఈ సాపేక్షస్వాతంత్ర్యం పరిధి ఏమిటో విస్తృతిఎంతో అది రూపం తీసుకునే తీరేదో దానిఫలితమేమిటో మార్క్సిజం ఒక ఫార్ములారూపంలో చెప్పదు, చెప్పలేదు, నిజానికి ఈ విషయాలను నిర్ణయించడమే పరిశీలనలో ఒక ముఖ్యఅంశ మవుతుంది. విషయం 'చిన్న'దయేకొద్దీ సాపేక్షస్వాతంత్ర్యం పెరుగుతుంది కాబట్టే చాలమంది మార్క్సిస్టులు పెద్దవిషయాల గురించి మాత్రమే, అదీ విశాలమయిన చారిత్రిక పరిధిలోనే, పరిశీలిస్తారు. నాలుగులైన్ల కవితను మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించడంకష్టం. 20వ శతాబ్దపు తెలుగుసాహిత్యాన్ని విశ్లేషించడం సులభం. అందుకు భిన్నంగా వివిధ ఉపరితల అంశాలగురించిన విశ్లేషణ తడబాటులేకుండ కుటుంబరావు ఇవ్వగలిగాడు. ఉపరితలాన్ని పరిశీలించేటప్పుడు పునాది ఎక్కడ పారిపోతుందో అన్నట్టు మాటమాటకూ దోపిడీసంబంధాలను ప్రస్తావించి అసలు విషయాన్ని గందరగోళపరిచే పిడివాదపు పద్ధతికాక, పదిశాతం పునాదికి కేటాయించి తొంబయిశాతం ఉపరితలం పరిధిలోనే వ్యవహరించే ఆలోచనాపద్ధతి దీనికికారణం. కొన్ని ఉదాహరణలు తీసుకుందాం. కళాభిరుచియొక్క ప్రాధాన్యతను గురించి కుటుంబరావు చెప్పిన విషయాలు పైనచూసాం. కళకూ కళావిమర్శకూ మధ్యవున్న సంబంధాన్ని గురించిగూడ రెండుమూడుచోట్ల వివరించాడు. విప్లవసాహిత్యం అభివృద్ధి చెందాలంటే దానితోబాటు విప్లవసాహిత్య విమర్శ అభివృద్ధిచెందాలి. (కుటుంబరావు ఇట్లాచెప్పడు, మంచిసాహిత్యం రాయాలంటే మంచివిమర్శ రావాలంటాడు. ఏమిటీ 'మంచి'అని మనం చిరాకుపడబోతుండగా, 'మంచి'అంటే దాని వర్గస్వభావాన్ని బట్టి వుంటుందని చివర్లో వివరిస్తాడు.) ఈ విమర్శ సాహిత్యకారులకు ప్రజల

జీవితానికీ తమసాహిత్యం యొక్క నిర్మాణానికీ వస్తువుకూవున్న సంబంధాన్ని వివరించడమే కాక, పాఠకులలో ఆ సాహిత్యంపట్ల అభిరుచిని పెంచుతుందిగూడ అని కుటుంబరావు గుర్తించాడు. విప్లవరచయితలకు సిద్ధాంతాన్ని బోధించడంలో నిమగ్నమయిన విప్లవ సాహిత్యవిమర్శ ఈ రెండవవిషయాన్ని కుటుంబరావునుండి నేర్చుకోవలసివుంది. విప్లవ సాంస్కృతికరంగం ప్రజలు కొత్తగా 'అభిరుచి' సంపాదించుకోవలసిన అవసరంలేని పాటకు పరిమితమయివుండక, లిఖితసాహిత్యం, చిత్రలేఖనం, మొదలయినవాటినికూడ తనలోకి ఇముడ్చుకోగలిగిననాడు ఇదిచాలా అవసరమవుతుంది.

'రెండురకాల సాహిత్యం' అనే వ్యాసంవుంది. ఇందులో కుటుంబరావు సాహిత్యాన్ని జాతి అంతటికీ చెందిన సాహిత్యం, ఒక ప్రాంతానికి మాత్రం చెందిన సాహిత్యం, అని విభజిస్తాడు. ఈ విభజన లిఖితసాహిత్యం - మౌఖికసాహిత్యం అనే విభజనలాగ పునాదిని తాకదు. సాహిత్యం 'జాతీయమా' లేక 'ప్రాంతీయమా' అనేది సాహిత్య ఉపరితల విషయమేగాని సారాంశానికి సంబంధించినదికాదు. అయినా ఈ విభజన సారస్వత చరిత్రలోని ఒకముఖ్యపరిణామక్రమాన్ని వివరించడానికి చక్కగా వినియోగపడుతుంది. ఒక సమాజంలో ఎప్పుడూగూడ ఒక ప్రామాణిక సాహిత్యముంటుంది. అది ఆసమాజం యొక్క నిర్దిష్టమయిన వర్గనిర్మాణాన్ని అనుసరించి ఆ సమాజం యొక్క సాహిత్య అవసరాలను తీరుస్తుంది. అయితే కొత్త ప్రేరణ ఒకటి ఆ సమాజంలో ఆకస్మికంగా తలెత్తితే (ప్రస్తుతం మన గ్రామాలలోని రైతాంగ పోరాటాల లాంటిది) అది సృష్టించే అవసరాన్ని 'ప్రామాణిక' సాహిత్యం తీర్చలేదు. కొత్త సాహిత్య పోకడలు పుట్టుకొస్తాయి. ఆ ప్రేరణ ఆదిలో ప్రాంతీయం కావడంవల్ల ఆ కొత్త పోకడలకుగూడ 'ప్రాంతీయ' స్వభావముంటుంది. అయితే ఆ ప్రేరణ పుట్టినంత ఆకస్మికంగా నశించక విస్తృతిని సాధించుకునేటట్లయితే ఆ కొత్త పోకడలుగూడ విస్తరించి ప్రామాణిక సాహిత్యంలో భాగమవుతాయి. వాటికి వ్యతిరేకమయిన అంశాలు ప్రామాణిక సాహిత్యంలో గనకవుంటే అవి నాశనమయి కొత్త తరానికి దారిఇస్తాయి. ప్రామాణిక సాహిత్యం స్వరూపమే అంతమేరకు మారిపోతుంది. సాహిత్య పరిణామక్రమం యొక్క గతితర్కంలోని ఒక ముఖ్య అంశాన్ని (ఉపరితలం పరిధిలోనే) ఇది చక్కగా వివరిస్తుంది.

ఈ సాహిత్య సంబంధమయిన వ్యాసాలన్నీ ఒక ఎత్తయితే కుటుంబరావు చరిత్ర గురించి రాసినవ్యాసాలు ఒకెత్తు. ఈ సంకలనంలో అటువంటి వ్యాసాలు

మూడు ఉన్నాయి. 'శాస్త్రజ్ఞానం' అన్న వ్యాసంలో కుటుంబరావు శాస్త్రీయదృక్పథం ఏర్పడాలంటే చరిత్ర గురించి గూడ శాస్త్రీయంగా ఆలోచించాలి అంటాడు. ఆయన వివరించకుండ గాలిలోకి విసిరేసిన అమూల్యమయిన వాక్యాలలో ఇది ఒకటి. చరిత్రను గురించి శాస్త్రీయంగా ఆలోచించడం నేర్చుకుంటే తక్కిన అన్ని విషయాల గురించీ శాస్త్రీయంగా ఆలోచించగలుగుతాం. ఎందుకంటే శాస్త్రీయమయిన ఆలోచన లేకపోవడానికి కారణం కేవలం మానసికమయిన బద్ధకం కాదు. చరిత్రనుండి సంక్రమించిన సామాజికశక్తులు సాంస్కృతిక రూపం తీసుకొని మన మనసులలో అభ్యుదయ నిరోధకమయిన గుదిబండలలాగ కూర్చుంటాయి. వాటిని కదిలించాలంటే వాటిమూలం తెలుసుకోవాలి. కులతత్వం, మతమౌఢ్యం, శ్రామికవ్యతిరేకత, ఇవన్నీ అటువంటి గుదిబండలు. వీటిమూలాన్ని చరిత్రలో వెతుక్కొని విశ్లేషించి విసర్జించనిదే మనం దేన్నిగురించీ శాస్త్రీయంగా ఆలోచించలేం.

ఈ దృష్టితో చూస్తే మనదేశచరిత్రను శాస్త్రీయంగా విశ్లేషించే ప్రయత్నం చాలా కాలం అసలు జరగకపోవడం, జరుగుతున్న గత 15-20 సంవత్సరాల కృషిఫలితం యూనివర్సిటీలకు పరిమితం అయిపోవడం, విచారించవలసిన విషయాలు. ఈ ఖాళీని పూరించే సమగ్రమయిన ప్రయత్నం కుటుంబరావు చేయకపోయినా, చరిత్ర గురించి మూసపద్ధతిలో కాకుండ శాస్త్రీయంగా ఆలోచించే ఆసక్తిని రేకెత్తించగల విషయాలు తన వ్యాసాలలో చెప్పాడు. ఎక్కువగా మన పురాణతదితర ప్రాచీన సాహిత్యం మీద 'కామెంట్స్' రూపంలో చెప్పాడు. 'చరిత్ర - పురాణమూ' అనే వ్యాసం వుంది. రామాయణంలో మొదట్లో లేకుండ తరువాత చేర్చబడ్డ అంశాలను (ప్రక్షిప్తాలను) ప్రస్తావిస్తూ, ఒకప్పుడు రాముడికి మిత్రుడయిన గుహుడు తరువాతికాలంలో భక్తుడయ్యాడంటాడు. రాముడు నాగరిక (అంటే వర్గసమాజ) ప్రతినిధి. గుహుడు ఆటవికుడు, అంటే ఆదిమసమాజ ప్రతినిధి. మనదేశంలో నాగరిక సమాజం ఆటవిక సమాజాన్ని కబళించే పోరాటం ఇప్పటికీ పూర్తికాలేదు. హిందూధర్మాన్ని అంగీకరించని ఆటవికులకు మ్లేచ్ఛులనీ కిరాతులనీ రాక్షసులనీ పేర్లుపెట్టి వాళ్ళను హింసాత్మకంగా అణిచేసిన ప్రాచీనకాలంనుండి రెండేళ్ళక్రితం ఇంద్రవెల్లిలో జరిగిన మారణకాండ దాకా ఈ కబళింపుక్రమం రక్తసిక్తమయినది. ఇప్పటి కథ పక్కనుపెట్టి చరిత్రలోకిపోతే, మెట్టుమెట్టుగా ఒక్కొక్క ఆటవిక జాతినీ లోబరచుకొని వాటిని కులాలగామార్చి హిందూ వర్ణవ్యవస్థలో అధోభాగాన స్వీకరిస్తూరావడం జరిగింది. ఈ క్రమంలోనే, నాగరిక ప్రభువయిన రాముడితో ఒకప్పుడు సమాన హోదాగల ఆటవిక ప్రభువయిన గుహుడు తరువాతి కాలంలో రాముడికి భక్తుడయి

సపర్యలుచేసే స్థితికి దిగజారాడు. ఈ విధంగా నాగరిక వర్గసమాజానికి లొంగిపోవడమే ఆటవిక సమాజాలకు 'విముక్తి' మార్గమన్న భావానికి ప్రచారంగానే శబరి అనే ఆటవిక స్త్రీ కథను సృష్టించి రామాయణంలోకి ఇరికించారని గూడ కుటుంబరావు సూచిస్తాడు. ఆటవిక సమాజాల చారిత్రిక 'విముక్తి' సాహిత్యరూపం తీసుకొని శబరికి పౌరాణిక 'ముక్తి' అయింది.

హిందూదేవుళ్లలో ఇంద్రుడికి పట్టినగతికూడ మనచరిత్రను చక్కగా ప్రతిబింబిస్తుంది. ప్రాచీనకాలంలో ఇంద్రుడు ఆర్యులకు ముఖ్యమయిన దేవుళ్లలో ఒకడు. కృష్ణుడు, విష్ణువు, శివుడు, వీళ్లందరూ ఆర్యులకు ఇంకా దేవుళ్లుకాకపూర్వం మాట యిది. అప్పటికి ఆర్యులింకా గణసమాజంలో నివసిస్తున్నారు. పశువులను పోషించుకుంటూ దేవుళ్లకు యజ్ఞాలుచేస్తూ జీవించిన వేదకాలంఅది. తరువాతికాలంలో క్రమంగా ఈ పశుపోషకులు తాము వ్యవసాయంచేపట్టడం, వ్యవసాయం చేయగల ఇతరతెగలను తమలోకి ఇముడ్చుకోవడం, జరిగింది. ఆ ఇతర తెగలదేవుళ్లనుగూడ తమదేవుళ్లుగా స్వీకరించక తప్పలేదు ఆర్యులకు. అట్లా వ్యావసాయక సమాజపు దేవుళ్లుగా వచ్చిచేరినవాళ్లు కృష్ణుడు తదితరులు. వీళ్లరాకతో ఇంద్రుడి పరపతి పడిపోయి వేదకాలంపోయి పురాణకాలం వచ్చేనాటికి లోఫర్‌గామిగిలాడు. ఇంద్రుడు తప్పులుచేసి విష్ణువు శరణువేడడం, కృష్ణుడితో తగువులాడడం, ఇవన్నీగూడ వ్యావసాయక సమాజానికీ ఆదిమసమాజానికీ మధ్యవున్న ఘర్షణను, ఆ ఘర్షణలో వ్యావసాయక సమాజం విజయాన్నీ, సూచిస్తాయి. మహాభారతంలోని ఖాండవ వనదహన ఘట్టాన్ని కుటుంబరావు ఈ దృష్టితో చక్కగావివరిస్తాడు. అడవినికాలబెట్టి వ్యవసాయ యోగ్యంగా మార్చడం ఇప్పటికీ ఆటవికులుచేసేపనే. ఇవ్వాళ సస్యశ్యామల మైదానంగావున్న గంగాయమునా తీరప్రాంతం ఒకప్పుడు దట్టమయిన అడవిగా వుండేది. ఆ అడవిని కాలబెట్టి, నరికి, వ్యవసాయయోగ్యంచేసే క్రమం దాదాపు 3000 సంవత్సరాలక్రితం ప్రారంభమయింది. కోశాంబిఅన్నట్టు కృష్ణార్జునులు ఖాండవవనాన్ని తగలబెట్టడం ఈ పరిణామాన్నే సూచిస్తుంది. ఆ వనదహనంమీద ఇంద్రుడు వర్షంకురిపించడం, అతనికీ అతన్ని దేవుడిగా ఆరాధించిన ఆదిమ సమాజానికీ వ్యావసాయక సమాజంతోవున్న వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తుందని కుటుంబరావు శాస్త్రీయంగా వ్యాఖ్యానిస్తాడు.

కుటుంబరావు కాల్పనిక సాహిత్యంనుండి విరమించుకోవడంతో ఒక మంచి కథకుడుపోతే, ఆయన మరణంతో ఒక మంచి సామాజికవ్యాఖ్యాత పోయాడు.